ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి


జిల్లా వార్తలు

శుక్రవారం 4 అక్టోబరు 2024

నీ ఢిల్లీ గుట్టు.. నేను విప్పుతా..

మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలకు కేతిరెడ్డి కౌంటర్

ధర్మవరం, అక్టోబరు 3: 'నీ ఢిల్లీ గుట్టు నేను విప్పుతా' అంటూ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఉద్దేశించి గురువారం ఎక్స్ (గతంలో ట్విట్టర్) వేదికగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్పందించారు. సత్యకుమార్ ఎన్నికలకు రెండు నెలల ముందు పోటీలోకి వచ్చి గెలవడం బాధకలిగించిందన్నారు. ఇప్పటికీ సత్యకుమార్ లుంగీలో గ్రామాల్లోకి వెళ్తే ఎవరూ గుర్తుపట్టరని కేతిరెడ్డి అన్నారు. అక్రమాలతో కూడిన 20 ఏళ్ల సత్యకుమార్ ఢిల్లీ గుట్టు విప్పుతానని కేతిరెడ్డి ట్వీట్ చేశారు.





అధికార పార్టీలో మొన్నటిదాకా నామినేటెడ్ పదవులపై చర్చ సాగింది. ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకురావడంతో జిల్లాలో మద్యం వ్యాపారంపై చర్చ సాగుతోంది. మద్యం షాపులపై చాలామంది అమితాసక్తి చూపుతున్నారు. మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యాపారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో బినామీ పేర్లతో వాటిని దక్కించుకుని, మద్యం వ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలన్న ఆలోచనతో ముందుకెళ్తున్నారు. దీనికి సహకరించాలంటూ కొన్ని నియోజకవర్గాల్లో ఎక్సైజ్ అధికారులను ఒప్పిస్తున్నట్లు తెలుస్తోంది. వారం రోజులుగా నియోజకవర్గ, మండలకేంద్రాల్లో సైతం మద్యం దుకాణాలపైనే నాయకులు చర్చించుకోవడం కనిపిస్తోంది. కూటమిలోని ఏ ఇద్దరు నాయకులు కలిసినా.. మద్యం దుకాణాలపైనే చర్చ. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. వాటిని రద్దుచేసి, ప్రైవేటు వ్యక్తులకు షాపులు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఆ హామీ మేరకు ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కేటాయించేందుకు సిద్ధమయ్యారు. దీంతో కూటమి నేతలతోపాటు వైసీపీ నాయకులు కూడా మద్యం దుకాణాలపై గురిపెట్టారు.

- హిందూపురం

ఎట్టాగైనా.. దుకాణం పెట్టాల్సిందే..!

మద్యం షాపులపై గురి

- ఒక్కో దానికి 20 మంది చొప్పున పోటీ
- ప్రధాన పార్టీల నాయకుల ఆసక్తి
- పట్టణాల్లో సిండికేట్, లాబీయింగ్
- కొన్నిచోట్ల పంపకాలు
- వాటా ఇవ్వాలంటూ పంచాయితీలు



20 మంది చొప్పున పోటీ

జిల్లాలో హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల్లో ఒక్కో షాపునకు 20మంది చొప్పున టెండరు దాఖలు చేయడానికి డబ్బు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో హిందూపురంతోపాటు మడకశిర, పెనుకొండ, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల్లో సైతం ఈ ఏడాది తీవ్ర పోటీ ఉంటుంది. కూటమి నాయకులతోపాటు కొంతమంది వైసీపీ నాయకులు, మరి కొంతమంది రియల్టర్లు, ఫైనాన్స్ నడుపుతున్నవారు సైతం మద్యం షాపులపై కన్నేశారు. ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది మద్యం షాపులకు తీవ్ర పోటీ నెలకొంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంతమంది తటస్థులు మద్యం షాపులకోసం టెండర్లు దాఖలు చేస్తామని కూటమి నాయకులతో సంప్రదించి, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతున్నట్లు సమాచారం.

దక్కించుకునేందుకు ప్రయత్నాలు

జిల్లాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు కూటమి పార్టీలకు చెందిన పలువురు ముఖ్యనేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులను సైతం తమకు అనుకూలమైన వారినే రప్పించుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు బినామీ పేర్లతో దరఖాస్తు చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ధర్మవరం మినహా అన్ని నియోజకవర్గాలు కర్ణాటక సరిహద్దులో ఉండటంతో షాపులపై నాయకులు ఉత్సాహం చూపుతున్నారు. టెండరు దాఖలు సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై అనుచరులతో మంతనాలు సాగిస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ దుకాణాలు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

తహతహలాడుతున్న నాయకులు



కొంతమంది అయా నియోజకవర్గాల్లో మద్యం వ్యాపారాన్ని ఏళ్లుగా తమ గుప్పిట్లో పెట్టుకుంటూ వచ్చారు. అధికారంలో ఉన్న పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ.. 2019 వరకు నిర్విఘ్నంగా కొనసాగించారు. గత వైసీపీ వైసీపీ ఐదేళ్లపాటు మద్యం దుకాణాలు బంద్ చేయడంతో ఆ వ్యాపారం చేసే కొంతమంది వ్యక్తులు ఎప్పుడెప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందా అని ఎదురుచూశారు. వారి కల ఫలించింది. దీంతో షాపులు దక్కించుకుని, వ్యాపారాన్ని పునఃప్రారంభించేందుకు తహతహలాడుతున్నారు. గతంలో మద్యం వ్యాపారం నియోజకవర్గంలో కొంతమంది నాయకుల చేతుల్లోనే ఉండేది. మిగిలినవారు ఆ వ్యాపారం వైపు వెళ్లేవారు కాదు. ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. ఒక నియోజకవర్గం నుంచి వంద మందికిపైగా మద్యం టెండర్లలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

సిండికేట్లు, లాబీయింగ్

ఈసారి పాత పద్ధతిలోనే మద్యం విధానం అమలు చేయనుండడంతో అధికారంలో ఉండి కాస్త పట్టున్న నేతలంతా దుకాణాల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. తమ వాటా ఉండేలా జాగ్రత్త వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని పట్టణ కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. కొంతమంది షాపుల్లో భాగం అడుగుతుండగా.. మరికొంతమంది చోటామోటా నాయకులు పల్లెల్లో విక్రయించేందుకు అవకాశం కల్పించాలని ప్రజాప్రతినిధుల వద్ద విన్నవించుకుంటున్నారు. మద్యం విక్రయాల్లో ఆరితేరిన కొందరు లాబీయింగ్‌కు దిగుతున్నారు. భారీగా విక్రయాలు సాగే దుకాణాలు తమకు అనుకూలంగా ఉన్నవారికి దక్కేలా చూసుకుంటున్నారు. మిగిలినవాటిలో సైతం వాటా కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. పల్లెల్లో ఎన్నడూలేని విధంగా గత ఐదేళ్ల వైసీపీ పాలనతో మద్యం విక్రయాలు అధికమయ్యాయి. ఇవి మద్యం షాపు యజమానులకు కలిసొచ్చే అవకాశంగా చెప్పవచ్చు. ఐదేళ్ల క్రితం పల్లెల్లో ఒకరిద్దరు మాత్రమే మద్యం విక్రయించేవారు. వైసీపీ హయాంలో నూతన పాలసీ తీసుకురావడంతో వీధికి ఒకట్రెండు బెల్టుషాపులు వెలిశాయి. ప్రస్తుతం వచ్చిన పాలసీతో వారితోనే మద్యం విక్రయాలు కొనసాగించేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

వాటా ఇస్తారా.. కోటా కావాలా..

జిల్లాలో పలుచోట్ల కూటమి నాయకులు.. మద్యం వ్యాపారులను పిలిపించుకుని మాట్లాడినట్లు తెలిసింది. ఇందులో కొంతమంది వేరే పార్టీకి చెందిన వారుండటంతో వారికి ముందుగానే హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. తమకు వాటా ఇస్తారా.. కోటా కావాలా.. అంటూ సంకేతాలుపంపారు. తమకు తెలియకుండా టెండర్లు వేసి వ్యాపారం చేసుకోగలరా అంటూ పలుచోట్ల హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. కొంతమంది వైసీపీ నాయకులు చాకచక్యంగా టీడీపీ నాయకులతో లోలోపల కుమ్మక్కైనట్లు చర్చ సాగుతోంది. డబ్బు తామే పెడతామనీ, పేరు మాత్రం కూటమి నాయకులదే ఉండనీ అంటూ కొంత మంది తెరపైకి వస్తున్నారు. ఖర్చంతా వైసీపీ నాయకులు భరించేలా వచ్చిన ఆదాయంలో ఇరుపార్టీల నాయకులు పంచుకునేలా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. వెనకుండి నడిపిస్తున్న వైసీపీ నాయకులపై కూటమి వర్గీయులు మండిపడుతున్నారు. తెరవెనుక వారున్నా తెరపై కూటమి నాయకులు ఉండటంతో ప్రజాప్రతినిధులు ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు. కొన్ని పట్టణాల్లో సిండికేట్ అయ్యేలా చూస్తున్నారు. పట్టణంలో 5 నుంచి 10 షాపులుంటే కొన్నింటికి మాత్రమే ఇలా ఉంటుంది. మరికొన్ని షాపుల్లో వ్యాపారం సాగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సిండికేట్ కాకుంటే కొంతమంది ఆదాయం పొంది.. మరికొంత మంది నష్టపోయే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పట్టణాల్లో సిండికేట్ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నోటిఫికేషన్ వెలువడడంతో సందడి మొదలైంది. ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు.



పాఠం వేరు.. పరీక్ష వేరు..!

గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం

- పది విద్యార్థులతో ఆటలు
- సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన
- అవగాహన కల్పించడంలో విఫలం
- రాయలేమని చేతులెత్తేస్తున్న విద్యార్థులు
- స్టేట్ సిలబస్‌లోనే పరీక్షలు

ధర్మవరం, అక్టోబరు 3: గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం.. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును అయోమయంలో పడేసింది. సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టారే తప్ప.. విద్యార్థులకు అవగాహన కల్పించలేదు. దీంతో సీబీఎస్ఈ విధా నంలో పరీక్షలు రాయలేమని విద్యార్థులు చేతు లెత్తేశారు. చేసేదిలేక స్టేట్ సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. సిలబస్ సీబీఎస్ఈ బోధించి, పరీక్షలు స్టేట్ సిలబస్‌లో పెడితే ఎలాగన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రాయలేం..

ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి పదో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అమల్లోకి వచ్చింది. సిలబస్ మేరకు పబ్లిక్ పరీక్షల్లో ఐదు ప్రశ్నాపత్రాల్లో పరీక్షలు నిర్వహించి, విద్యార్థుల అభిప్రాయాలు సేకరించగా.. కొత్త విధానంలో రాయలేమని తేల్చిచెప్పారు. సీబీఎస్ఈలో ఐదు ప్రశ్నాపత్రాలు మాత్రమే ఉండగా.. స్టేట్ సిలబస్ విధానంలో ఏడు ఉంటాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సైన్స్ (రెండు), గణితం, సోషల్ పేపర్లు ఉంటాయి. ఈ ఏడు ప్రశ్నాపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంది. సిలబస్, పాఠ్యపుస్తకాలు సీబీఎస్ఈలో ఉన్నప్పటికీ ఈఏడాది టెన్త్ విద్యార్థులకు స్టేట్ తరహాలో పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టినప్పటికీ విద్యార్థుల్లో సరైన అవగాహన కల్పించకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్‌పరీక్షలు రాసే విద్యార్థులకు ఏడుప్రశ్నాపత్రాలపై అవగాహన కల్పించాల్సి ఉంది.


స్టేట్ సిలబస్‌లోనే పరీక్షలు: మీనాక్షి, డీఈఓ

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రాష్ట్రప్రభుత్వం స్టేట్ సిలబస్‌లోనే నిర్వహించాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీబీఎస్ఈ సిలబస్‌లో పరీక్షలు ఉండవని చెబుతున్నాం. వారిలో నెలకొన్న అపోహను తొలగిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు కూడా తెలియజేస్తున్నాం.



నేడు స్వర్ణాంధ్ర జిల్లా విజన్ ప్రణాళిక సమావేశం

పుట్టపర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్ జిల్లాస్థాయి ప్రణాళిక సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తిలోని సాయిఆరామ్‌లో సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారన్నారు.



ప్రశాంతి నిలయంలో కలశ పూజ చేస్తున్న పండితుడు

ప్రశాంతి నిలయంలో ఉత్సవాలకు శ్రీకారం

అలరించిన ప్రేమవాహిని నృత్యరూపకం

పుట్టపర్తి: ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో గురువారం నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు కలశస్థాపన చేసి, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు సంగీత విభావరి పేరిట భక్తిపాటలు ఆలపించారు. గంటపాటు మధురగానంతో భక్తులను అలరింపజేశారు. సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా బాలవికాస్ చిన్నారులు ప్రేమవాహిని సంగీత నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. రాత్రి పట్టణవీధుల్లో సత్యసాయి రథసేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి రథానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రత్యేకపూజలు నిర్వహించి, ప్రారంభించారు. మహబూబ్‌నగర్ భక్తులు బతుకమ్మకు ప్రత్యేకపూజలు, నృత్యం చేశారు. చెక్కభజన, కోలాటంతో నగరసంకీర్తన కోలాహలంగా సాగింది. కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.





నాటికలోని సన్నివేశం, నృత్యం చేస్తున్న చిన్నారులు

మత్స్యావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు



మత్స్యావతారంలో శ్రీవారు

కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాల అనంతరం మత్స్యావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

పాహిమాం.. పరమేశ్వరీ..

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



హిందూపురంలో భువనేశ్వరీ దేవిగా వాసవీమాత

లేపాక్షి, అక్టోబరు 3: అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. తొలిరోజు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవిని శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. హిందూపురంలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాతను పూలు, నగలతో భువనేశ్వరీమాతగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.




లేపాక్షి ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా దుర్గాదేవి

రెండే..!

మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు

తెరవెనుక మంత్రాంగాలు




హిందూపురంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సు

పుట్టపర్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు గురువారం రెండే దరఖాస్తులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం.. మద్యం దుకాణాలను ప్రైవేటుకు అప్పగిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈనేపథ్యంలో జిల్లాలో మద్యం దుకాణాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మంగళవారం మొదలు పెట్టారు. ఈనెల 9 వరకు గడువు ఉంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. హిందూపురం, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, పుట్టపర్తి, పెనుకొండ, తనకల్లు, కదిరి, మడకశిర ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తుల కోసం టెండరు పెట్టెలను ఏర్పాటు చేశారు. ఐదేళ్లుగా మద్యం వ్యాపారులు ఖాళీగా ఉండాల్సి వచ్చింది. మళ్లీ పాత విధానం తీసుకురావడంతో వారిలో ఉత్సాహం వచ్చింది. మద్యం దుకాణాల నిర్వహణకు వ్యాపారుల కంటే అధికార కూటమి నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పురపాలక, నగర పంచాయతీలు, మండల కేంద్రాల్లో మద్యం దుకాణాలకు తీవ్రపోటీ నెలకొంది. వాటిని దక్కించుకునేందుక సిండికేట్ విధానాన్ని ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదుకాణానికి ఎవరు దురఖాస్తు చేయాలోనన్న సంప్రదింపులు ఊపందుకున్నాయి. వివిధ స్థాయిల్లో తెరవెనుక దురఖాస్తుల ప్రక్రియలోనే మంత్రాంగాలు జోరందుకున్నాయి. కూటమి నేతల ఆశీస్సులేనిదే మద్యం దుకాణాల ఏర్పాటు అంత సులువుకాదన్న చర్చ సాగుతోంది. ఈనేపథ్యంలో వ్యాపారులు, అధికార పార్టీ నేతలు బేరసారాలకు తెరలేపినట్లు సమాచారం. తమ అనుచరవర్గమే మద్యం దుకాణాలకు దరఖాస్తు చేస్తారనీ, ఎవరు, ఏదుకాణానికి వేయాలో మంతనాలు సాగుతున్నాయి. ఇందుకోసం కొందరు నేతలు రంగంలోకి దిగి లాబీయింగ్ చేస్తున్నారు. దుకాణాలకు దరఖాస్తు రూపంలో ప్రభుత్వానికి వచ్చే రూ.2లక్షల ఆదాయానికి సిండికేట్‌తో గండి కొట్టే ఎత్తుగడ వేశారు. ఇంకా వారం గడువు ఉన్న నేపథ్యంలో దరఖాస్తుల దశలోలనే బేరసారాలు, సిండికేట్‌తో దుకాణాలు కొట్టేయాలని చూస్తున్నారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సిండికేట్లు, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసే వారికి దెబ్బపడే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో ఎవరెవరు దరఖాస్తు చేయాలని చూస్తున్నారన్న దానిపై నిఘా పెట్టారు. గురువారం నాటికి కేవలం ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయంటే ఏమేరకు బేరసారాలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

కొత్తచెరువు, అక్టోబరు 3: జిల్లాలోని పలుచోట్ల బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పుట్టపర్తి మండలం వీరాంజనేయపల్లి సమీపంలోని చాపచెరువు రాత్రికిరాత్రే నిండి మరువ పోతోంది. కొత్తచెరువులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలోని నల్లమ్మ దేవాలయం వద్దగల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. చెన్నేకొత్తపల్లిలో అత్యధికంగా 82.4 మి.మీ, వర్షపాతం నమోదైంది. పుట్టపర్తి 72.4, గాండ్లపెంటలో 3.6 మి.మీ, వర్షం కురిసింది.



పుట్టపర్తిలో మరువ పారుతున్న చాపచెరువు

సాలువ వంశస్థుల శాసనం లభ్యం

● చరిత్రకారుడు మైనాస్వామి



శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

గోరంట్ల, అక్టోబరు 3: సాలువ వంశస్థుల అరుదైన శాసనం లభించిందని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. విజయనగర (హంపి) సామ్రాజ్యాన్ని పాలించిన రెండవ రాజవంశం సాలువ పాలకులు చాలుక్య వంశ వారసులన్న చారిత్రక అంశాన్ని ఆయన వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలోని మాధవరాయ ఆలయం ముందున్న రాతి బండపై చెక్కిన అరుదైన శాసనం గురించి ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. శ్రీమాధవరాయస్వామి సేవలకు భూదానమిస్తూ శాసనాన్ని సాలువ నరసింగరాయులు రాయించారన్నారు. శాసనకర్త పేరు శ్రీమాన్ నరసింగభూపతిరాయ అని ఉండగా మేదిని మీసరగండ, కటారి వంటిబిరుదులున్నాయని వివరించారు. మొదట చంద్రగిరి తరువాత పెనుకొండ సీమ రాజప్రతినిధిగా పనిచేసిన సాలువ 1485 నుంచి 1491 వరకు విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. సాలువ వంశావళి శాసనం 34 వరసల్లో లిఖించబడిందని తెలియజేశారు. సంస్కృత శాసనాన్ని, సుందరమైన తెలుగులో రాశారన్నారు. శాసనం పైభాగంలో సుదర్శన చక్రం, సూర్యుడు, చంద్రుడు, శంకు చిత్రాలున్నాయని, హంపి నుంచి నెల్లూరు జిల్లా ఉదయ్‌గిరి, తమిళనాడులోని కడులూరు వరకు ఉన్న అనేక శాసనాల్లో వంశప్రసక్తి ఎక్కడ కనిపించలేదన్నారు. ఈ శాసనాన్ని భద్రంగా పరిరక్షించుకోవాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు.

ఎంపీ అంబికాకు అరుదైన అవకాశం

లేబర్, టెక్స్‌టైల్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియామకం

అనంతపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వంలో అరుదైన అవకాశం లభించింది. తొలిసారి ఎంపీగా ఎన్నికైన ఆయనకు కేంద్ర ప్రభుత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీలో చోటు లభించింది. బసవరాజు బొమ్మై చైర్మన్‌గా ఉన్న కమిటీలో అంబికా లక్ష్మీనారాయణను సభ్యులుగా నియమించారు. లోకసభ సభ్యులు 21 మంది, రాజ్యసభ సభ్యులు 10 మంది ఉన్న ఈ కమిటీలో అంబికాకు స్థానం దక్కింది. కాగా ఇప్పటికే ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ఓబీసీ, స్కిల్ బోర్డు సంక్షేమ సభ్యులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీ అంబికా ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తొలిసారిగా ఎంపీగా ఎన్నికైన తనను అటు ఓబీసీ, స్కిల్ బోర్డు సంక్షేమ సభ్యులుగా నియమించడంతో పాటు లేబర్, టెక్స్‌టైల్స్ స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీలోనూ సభ్యుడిగా స్థానం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తులు నిల్

దరఖాస్తు విధానంపై వ్యాపారులకు వివరించిన అధికారులు



దరఖాస్తు విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: జిల్లావ్యాప్తంగా ప్రైవేటు మద్యం షాపులకు ఇప్పటి దాకా ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ఈనెల 1వతేదీ నుంచి జిల్లాలోని 10 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం మూడో రోజు అన్ని స్టేషన్ల పరిధిల్లో పలువురు వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే పద్ధతిపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు, సిబ్బంది ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు ఎలా చేసుకోవాలి...? ఆఫ్‌లైన్‌లో ఏవిధంగా పద్ధతులు పాటించాలన్న విషయంపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరుపై ఒక్కో దరఖాస్తు రుసుం (నాన్‌రీఫండబుల్) రూ.2 లక్షలు డీడీ తీయాలని ఎక్సైజ్ డీసీ నాగముద్దయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. డీడీతోపాటు తగిన డాక్యుమెంట్లను స్థానిక ఎక్సైజ్ స్టేషన్లల్లో అందజేస్తే, ఆయా ఎక్సైజ్ స్టేషన్లల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నేరుగా వ్యాపారులే దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 9వతేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉందని, అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుంతకల్లు మీదుగా సికింద్రాబాద్-వాస్కో ఎక్స్‌ప్రెస్

గుంతకల్లు, అక్టోబరు 3: ప్రయాణికుల డిమాండ్‌ను అనుసరించి సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య (వయా గుంతకల్లు) బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ రైలుకు ఈనెల 6వ తేదీన సింగిల్ ట్రిప్ ఇనాగురల్ స్పెషల్ రన్ నడపనున్నట్లు తెలియజేశారు. ఈరైలు ఆరవ తేదీన సికింద్రాబాద్‌లో ఉదయం 11-45 గంటలకు బయలుదేరి కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుంతకల్లు (సాయంత్రం 6-15కు), బళ్లారి, హోస్పేట, కొప్పల్, గదగ్, హుబ్లీ, ధార్వాడ, లోండా, క్యాస్టల్ రాక్, కులేం, శాన్వోర్డెం, మడ్గావ్ చర్చోరెం మీదుగా మరుసటి రోజు ఉదయం 7-20 గంటలకు వాస్కోడగామా స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈరైలు (నం. 17039) ఈ నెల 9వ తేదీ నుంచి బుధ, శుక్రవారాలలో సికింద్రాబాద్‌లో ఉదయం 10-05 గంటలకు రెగ్యులర్‌గా బయలుదేరి సాయంత్రం 5-05 గంటలకు గుంతకల్లుకు చేరి, మరుసటి రోజు ఉదయం 5-45 గంటలకు వాస్కోకు చేరుకుంటుందని తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040) ఈనెల 10వ తేదీ నుంచి గురు, శనివారాల్లో వాస్కోడగామా స్టేషన్‌లో ఉదయం 9 గంటలకు బయలుదేరి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు రాత్రి 8-40 గంటలకు వచ్చి, మరుసటిరోజు ఉదయం 6-20 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందన్నారు. ఈ రైలుకు రిజర్వేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు రైల్వే అధికారులు వివరించారు.

అహుడా వైస్ చైర్మన్‌గా జేసీ బాధ్యతలు

అనంతపురం క్రైం, అక్టోబరు 3: జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మకు అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) వైస్ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. ఇదివరకు వైస్ చైర్మన్‌గా పనిచేసిన మురళీకృష్ణగౌడ్‌ను సీడీఎంఏ కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన రిలీవ్ అయ్యారు.

చీనీ నిరాశ..!



మార్కెట్‌కు వచ్చిన చీనీ దిగుబడులు (ఫైల్)

ఈ సీజన్‌లో ఆదాయం అంతంతే

ప్రారంభంలో బాగున్నా తరువాత పడిపోయిన ధరలు

ఎగుమతి ప్రాంతాల్లో వర్షాలే ప్రధాన కారణం

మార్కెట్ ఆదాయానికి సైతం గండి

అనంతపురంరూరల్/ గార్లదిన్నె, అక్టోబరు 3: చీనీ రైతులకు నిరాశే మిగులుతోంది. ప్రకృతి వైపరీత్యాలు ఒక వైపు, గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. దాదాపుగా చీనీ సీజన్ ముగుస్తోంది. అయితే ఈ సీజన్ చీనీ సాగు రైతులకు పెద్దగా కలిసిరాలేదని చెప్పవచ్చు. మార్కెట్‌కు సైతం ఉత్పత్తులు తక్కువగా రావడం.. ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో లేదని తెలుస్తోంది.

తగ్గిన ధరలతో నష్టం

జిల్లాలో 96వేల ఎకరాల్లో చీనీ పంటను సాగుచేశారు. ఇందులో 70వేల ఎకరాల్లో కాపు ఉంది. పంట దిగుబడి ఐదు ఎకరాలకు 25 నుంచి 30 టన్నుల మధ్య సాధారణంగానే ఉంటోందని రైతులు అంటున్నారు. అయితే ముగిసిన సీజన్‌లో ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. 20 టన్నులు దిగుబడికి మించి రాలేదని రైతులు అంటున్నారు. అంతంతమాత్ర ధరలతో నష్టపోయామంటున్నారు. సీజన్ ప్రారంభంలో కొంత బాగున్నా ఆ తరువాత ఉత్పత్తులకు సంబంధించి ఎగుమతి ప్రాంతాల్లో వర్షాల కారణంగా ధరలు తగ్గిపోయాయి. దీంతో నష్టపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, ఆదాయం ఆశించిన స్థాయి కంటే తక్కువగా వచ్చిందని రైతులు అంటున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సీజన్‌లో ఎక్కువగా నష్టపోయామని వివరిస్తున్నారు.

మార్కెట్‌కు తక్కువగా దిగుబడులు

సాధారణంగా చీనీ సీజన్ ప్రతి ఏటా జనవరి నుంచి అక్టోబరు వరకు ఉంటుంది. ఆగస్టు వరకు బాగా ఉండి క్రమేణా దిగుబడులు తగ్గుతూ వస్తాయి. ప్రతి ఏడాది లాగా ఈయేడు కూడా అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు ఉత్పత్తులు వచ్చాయి. అయితే చాలా వరకు తగ్గాయి. దీనికి ప్రధాన కారణం దిగుబడులు తగ్గడమేకాకుండా పులివెందుల మార్కెట్‌కు ఉత్పత్తులు కొంతమేర వెళ్లడం స్థానిక మార్కెట్‌పై ప్రభావం చూపిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీనికితోడు పులివెందుల మార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహించడం. ఇక్కడ ఈనామ్ పద్ధతిలో నిర్వహించడం ఒక కారణమన్న అభిప్రాయమూ వినిపిస్తోంది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది సీజన్‌లో మార్కెట్‌కు కాయలు తగ్గడంతో పాటు మార్కెట్ ఆదాయానికి సైతం కొంత గండి పడింది. 2022-23లో 87,485 టన్నుల ఉత్పత్తులు రాగా.. యూజర్ చార్జీల రూపంలో రూ.1.81కోట్లు ఆదాయం వచ్చింది. అదేవిధంగా 2023-24లో 1,08,085 టన్నులు రాగా రూ.1.90కోట్లు మార్కెట్‌కు ఆదాయం సమకూరింది. ప్రస్తుత సీజన్‌లో 2024-25లో 94,989టన్నులు రాగా 1.61కోట్ల ఆదాయం వచ్చింది. మార్కెట్‌కు రూ.30లక్షల మేర ఆదాయం తగ్గింది.

ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు



ఐదు ఎకరాల్లో 600 చెట్లు ఉన్నాయి. ఈసారి ఆరేడు లక్షలకు పైగా పెట్టుబడి రూపంలో పెట్టాను. అయితే ఆశించిన స్థాయిలో దిగుబడులు మాత్రం రాలేదు. మొత్తంగా రూ. పది లక్షల వరకు దిగుబడుల రూపంలో వచ్చింది. దీనికితోడు గత ఏడాది గైరంగాలు టన్ను రూ.40వేలతో అమ్ముడుపోయాయి. ఈయేడు రూ.20వేలు పలికాయి. ధర సగానికి సగం పడిపోయింది. ఇలా అయితే రైతులు అప్పుల పాలుకావాల్సిందే.

- చిదంబరప్ప, రైతు, పెనకచర్ల గ్రామం

ధర బాగుంటే ఆదాయం వచ్చేది..



ఎనిమిది వందల చీనీ చెట్లున్నాయి. రూ.ఆరు లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. దిగుబడి అంతంతమాత్రమే. మొత్తంగా రూ.11లక్షల వరకు దిగుబడి వచ్చింది. గత ఏడాది గైరంగాలు టన్ను రూ.43వేలతో విక్రయించాం. ఈసారి రూ.18వేలు పలికాయి. ధర బాగుండుంటే రూ.18లక్షల వరకు ఆదాయం వచ్చేది. ఆ పరిస్థితి లేకుండా పోయింది.

- బాలకృష్ణ, రైతు, గార్లదిన్నె

కొంత తగ్గాయి..



గత సీజన్ కంటే ఈసారి కొంత మేర మార్కెట్‌కు చీనీ దిగుబడుల రాక తగ్గింది. సీజన్ మధ్యలో ఉత్పత్తులు ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో ఎక్కువగా వర్షాలు కురవడం, పులివెందుల మార్కెట్ ప్రారంభం కావడం వంటి కారణాలతో మార్కెట్‌కు దిగుబడులు రాలేదు. ఆదాయం కూడా తగ్గింది.

- గోవిందు, ఎంపికశ్రేణికార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, అనంతపురం

తల్లిని మోసం చేసిన తనయుడు

డబ్బు డ్రా అంటూ ఆస్తి రాయించుకున్న ఘనుడు

ఆస్తిలో సగం ఇవ్వమన్నందుకు తల్లిపై దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమణి

విడపనకల్లు, అక్టోబరు 3: నవమాసాలు మోసిన తల్లిని ఓ తనయుడు మోసం చేశాడు. డబ్బులు డ్రా చేయాలంటూ ఆస్తి పత్రాలపై సంతకం చేయించుకున్నాడు. తెలుసుకున్న తల్లి ఆస్తిలో సగమైనా ఇవ్వమన్నందుకు ఆమెపై దాడి చేసి గాయపరచి పరారయ్యాడు. తనకు జరిగిన అన్యాయంపై ఆ తల్లి రోదిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన కరముక్కల గ్రామంలో గరువారం చోటు చేసుకుంది. కరముక్కల గ్రామానికి చెందిన నాగవేణి, ఈశ్వరయ్య దంపతులు. వారికి ఇద్దరు సంతానం. 13 సంవత్సరాల క్రితం ఈశ్వరయ్య మృతి చెందాడు. ఆయన మృతి అనంతరం కుమార్తె సంగీతకు సింధనూరుకు చెందిన సుగరయ్యతో వివాహం చేసింది. ఇందుకుగాను రూ. 15 లక్షల వరకు అప్పు చేసింది. అయితే బ్యాంకులో డబ్బులు డ్రా చేయాలని తల్లి చేత సంతకం చేయించి 22 ఎకరాల భూమిని తనపేరు మీద చేయించుకున్నాడు కుమారుడు అశోక్. విషయం తెలుసుకున్న తల్లి అందులో 10 ఎకరాలన్నా తనకు ఇవ్వాలని విన్నవించుకుంది. అడిగిన ప్రతిసారీ ఆమెను కొట్టడం, ఇంటి నుంచి గెంటేయడం చేసేవాడు. ఈ నేపథ్యంలో ఆమె కూతురు వద్దకు వెళ్లి ఉంటోంది. గురువారం మరోమారు కుమారుడి వద్దకు వచ్చి ఆస్తి ప్రస్తావన తీసుకువచ్చింది. దీంతో ఆగ్రహం చెందిన అశోక్ ఆమెపై దాడిచేయి గాయపరిచాడు. చేయి విరగడంతో అశోక్ అక్కడి నుంచి పరారయ్యాడు. నాగవేణి తనకు జరిగిన అన్యాయంపై ఉవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రాణంతీసిన నిర్లక్ష్యం..!

పురం ఆస్పత్రిలో శిశువు మృతి

డాక్టర్ నిర్లక్ష్యంతోనే అంటున్న బాధితులు

వేడుకున్నా స్పందించలేదంటూ ఆవేదన



బాలింత మైథిలి



మైథిలి తల్లి రాధమ్మ

హిందూపురం అర్బన్, అక్టోబరు 3: స్థానిక జిల్లా ఆస్పత్రిలో గురువారం ఉదయం పసికందు మరణించాడు. హిందూపురం మండలం మేళాపురం ప్రాంతానికి చెందిన మైథిలి ప్రసవవేదనతో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆస్పత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షించి, అడ్మిట్ చేసుకున్నారు. ఆ తరువాత నొప్పులు తీవ్రమయ్యాయి. మైథిలి నొప్పులు భరించలేకపోతోందని సిజేరియన్ చేయాలని ఆమె తల్లి రాధమ్మ.. పలుమార్లు డ్యూటీలో ఉన్న నర్సులను వేడుకుంది. వారు పరిస్థితిని ఆన్‌డ్యూటీ డాక్టర్ నందితకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రిపోర్టులను వాట్సాప్‌కు పంపారు. దానిని బట్టి ఆమె నార్మల్ డెలివరీ అవుతుందనీ, నొప్పులు సహజమేననీ, భరించాలని వైద్యురాలు చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు. నార్మల్ అయితే మంచిదేగా అని గర్భిణిని తల్లి ఓదార్చుతూ వచ్చింది. గురువారం ఉదయం 7.30 గంటలకు డాక్టర్ నందిత వచ్చి మైథిలిని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లారు. సిజేరియన్ చేసి, ఆడబిడ్డను బయటకు తీశారు. అప్పటికే హార్ట్ బీట్ తక్కువ ఉండటంతో పాప చనిపోయి ఉందని వైద్యులు చెప్పడంతో బాధితులు ఆవేదనకు లోనయ్యారు. నార్మల్ అవుతుందని చెప్పిన వైద్యులు.. సిజేరియన్ ఎందుకు చేశారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. బుధవారమే చేసి ఉండుంటే బిడ్డ బతికి ఉండేదని వాపోయారు. రిపోర్టుల ప్రకారం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు చెప్పారనీ, సడన్‌గా పాప హార్ట్‌బీట్ ఎలా తగ్గిందని మండిపడుతున్నారు. రాత్రంతా బాధపడుతుంటే ఒక్కసారైనా డాక్టర్ రాలేదనీ, నర్సులే పరీక్షిస్తున్నారని ఆగ్రహించారు. నిర్లక్ష్యంతోనే బిడ్డ చనిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారణ చేపడుతున్నాం: డేవిడ్‌రాజ్, ఆర్ఎంఓ

ఆస్పత్రిలో శిశువు మృతి చెందిన విషయం వాస్తవమే. దీనిపై విచారణ చేపడుతున్నాం. తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారనీ, సిజేరియన్ తరువాత బిడ్డ హార్ట్‌బీట్ తగ్గిందని డాక్టర్ నందిత పేర్కొన్నారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదు.

పాసుపుస్తకం ఇప్పించండి సారూ..

తహసీల్దార్ కాళ్లు పట్టుకున్న రైతు



పాసుపుస్తకం కోసం తహసీల్దార్‌ను వేడుకుంటున్న రామలింగప్ప

మడకశిర రూరల్, అక్టోబరు 3: తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని తహసీల్దార్ కాళ్లను రైతు పట్టుకున్నాడు. స్థానిక కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కరుణాకర్ కాళ్లపై మండలంలోని గుద్దిలిపల్లికి చెందిన రైతు రామలింగప్ప పడ్డాడు. రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామలింగప్ప కుటుంబీకులకు గంగుళవాయిపాళ్యం పంచాయతీ పరిధి సర్వే నంబరు 170పైకి 11.44 ఎకరాల భూమి ఉంది. అందులో రామలింగప్పకు 1.24 ఎకరాలు ఉంది. ఇది పిత్రార్జితం. దీనికి సంబంధించి వన్‌బీ ఉంది. బ్యాంకులో రుణం కూడా తీసుకున్నాడు. అందులో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్లుగా ఆ భూమి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో లేవు. మరొకరి పేరుతో పాసు పుస్తకాలు ఇచ్చారని రైతు వాపోయాడు. తన భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి, పాసుపుస్తకం ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరాడు. పెనుకొండలో ఆర్డీఓకి కూడా సమస్య విన్నవించుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తహసీల్దార్‌గా కరుణాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కలిసి రికార్డులను చూపించి, న్యాయం చేయాలని కోరాడు. అంతవరకు కదిలేదిలేదని కార్యాలయం వరండాలో కూర్చున్నాడు. న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతు వెనుదిరిగాడు.

రికార్డులను పరిశీలించి, న్యాయం చేస్తాం

- కరుణాకర్, తహసీల్దార్, మడకశిర

ఇక్కడ తహసీల్దార్‌గా గురువారమే బాధ్యతలు తీసుకున్నా. రికార్డులను పరిశీలించి, మూడు రోజుల్లోగా న్యాయం చేస్తాం.


ఒక్క వానకే..!



గుల్జార్‌పేట్‌లో..



శ్రీకంఠం సర్కిల్‌లో...



ఆర్టీసీ బస్టాండ్ వద్ద..



టవర్‌క్లాక్ వద్ద..

చాలా రోజుల తరువాత భారీ వర్షం..! ఎప్పటిలాగే అనంతపురం నగరం జలమయమైంది. క్లాక్ టవర్, ఆర్టీసీ బస్టాండు, గుల్జార్‌పేట్, శ్రీకంఠం సర్కిల్, రాజు రోడ్డు.. ఇలా అన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు.. మురుగు నీరు ఏకమై రోడ్లను ముంచెత్తాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్క వానకే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక రోజుల తరబడి కురిస్తే ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. నగర పాలకులు, అధికారులు సమస్య ఎక్కడుందో గుర్తించి.. పరిష్కరించాలి. భారీ వర్షానికి నగరంలో గురువారం రాత్రి పవర్ కట్ చేశారు. దీంతో జనం అంధకారంలో ఉండాల్సి వచ్చింది. పుట్లూరు, కూడేరు, బుక్కరాయసముద్రం, పామిడి, విడపనకల్లు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. శింగనమల, గుంతకల్లు, నార్పల మండలాల్లో జల్లులు పడ్డాయి.

- అనంతపురం అర్బన్

ఎంబీఏ, ఎంసీఏకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 3: ఎస్కేయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్-2024 కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటా ప్రవేశాల ప్రక్రియ ముగిసిందని, మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు స్పాట్ అడ్మిషన్స్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు శనివారం నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్‌కు సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు. ఐసెట్‌లో ర్యాంకులు సాధించిన వారే అర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ పొందేవారికి ప్రభుత్వ ఫీజురీయింబర్స్‌మెంట్ రాదని ప్రవేశం పొందిన రోజే కోర్సు ఫీజు చెల్లించాలని తెలిపారు.

జీడిపల్లికి 882 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 3: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 882 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 842 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.636 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభం

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం మొదలైంది. తొలి రోజు జిల్లావ్యాప్తంగా 789 మంది రైతులు 1280 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పప్పుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

రేపు పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, అక్టోబరు 3: పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌ను పురస్కరించుకొని శనివారం ప్రధాని నరేంద్రమోదీ ఈ ఏడాది రెండో విడతకు సంబంధించిన పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 27,9,161 మంది రైతులకు ఒక్కో రైతుకు రూ.2వేలు చొప్పున రూ.55.83 కోట్లను నేరుగా డీబీటీ ద్వారా ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు.

టమోటా కిలో రూ.77

అనంతపురంరూరల్, అక్టోబరు 3: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.77తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 630 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.67, కనిష్ఠ ధర రూ.51పలికినట్లు ఆయన తెలిపారు.

దసరా ఉత్సవాలకు శ్రీకారం



పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గాయత్రీ అమ్మవారి ఆలయ ముస్తాబు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజున పలు ఆలయాల్లో అమ్మవార్లు.. వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలోని గాయత్రీ అమ్మవారు, నల్లచెరువులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ, ధర్మవరం మండలంలోని ఉప్పునేసినపల్లి గ్రామంలో కొల్లాపురమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. బత్తలపల్లిలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు.



గాయత్రీ అమ్మవారు





ధర్మవరంలో రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరిదేవి



శ్రీమహాలక్ష్మీ దేవి అలంకరణలో కదిరి కుమ్మరవాండ్లపల్లి మల్లాలమ్మ దేవి









బత్తలపల్లి, ముదిగుబ్బ, కొత్తచెరువు, నల్లచెరువు, ఉప్పునేసినపల్లిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

క్రైం న్యూస్

గోడ కూలి బాలుడి మృతి



పార్థసారథిరెడ్డి (ఫైల్)

తాడిమర్రి, అక్టోబరు 3: మండలంలోని మోదుగులకుంట గ్రామానికి చెందిన శివానందరెడ్డి, రజని దంపతుల కుమారుడు పార్థసారథిరెడ్డి (4) గోడకూలి మర ణించాడు. ఈ దంపతులకు ఇద్దరు కమార్తెలు, ఒక కుమారుడు పార్థసారథి ఉన్నారు. ఈ బాలుడు గురువారం సాయంత్రం గ్రామంలోని ఓ ఇంటి వద్ద గోడ కింద ఆడుకొంటుండగా ఉన్న ఫలంగా గోడకూలి బాలుడిపై పడింది. గమనిం చిన గ్రామస్థులు ఆ బాలుడిని వెలికి తీసి.. తల్లిదండ్రులకు తెలిపారు. తాడిమ ర్రి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో బత్తలపల్లిలోని ఆర్డీటీకి తరలించారు. అయితే బాలుడు అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ధర్మవరం, అక్టోబరు 3 : స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో గురువారం ఉదయం ఆటోను ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ధర్మవరం నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ను ధర్మవరం నుంచి బత్తలపల్లికి వెళ్తున్న పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ఉన్న శ్రీదేవి, ఓబులప్ప, గౌస్‌పీరా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరికి గాయాలు



బత్తలపల్లి, అక్టోబరు 3: స్థానిక బైపాస్ సమీపంలో గురువారం కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డరు. పెద్దపోప్పురు సోమనపల్లికి చెందిన రామంజినేయులు, అరుణ్ కారులో బత్తలపల్లి మీదుగా అనంతపురం వెలుతుండగా బత్తలపల్లి సమీపంలో అనంతపురం నుంచి బత్తలపల్లి వైపునకు వస్తున్న లారీ ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న రామంజినేయులు, అరుణ్ కారులో ఇరుక్కుపోయారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకుతీసి.. ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

ఆటో, బొలెరో ఢీ

నంబులపూలకుంట, అక్టోబరు 3: మండల కేంద్రానికి సమీపంలోని పెడబల్లి రోడ్డు జొన్నలగడ్డమిట్ట వద్ద గురువారం ఆటో, బొలెరో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తూర్పు నడింపల్లి నుంచి మండల కేంద్రం మీదుగా పెడబల్లికి కూలీలు ఆటోలో వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన నారాయణమ్మ, రంగనపల్లికి చెందిన గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కదిరిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు

గాండ్లపెంట, అక్టోబరు 3: కదిరి ఆర్టీసీ డిపో డ్రైవర్ ఈశ్వర్‌నాయక్‌పై కండెక్టర్ శివప్ప స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతనెల 18న ద్వారనాల వద్ద బస్సు వెళ్తుండగా.. డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడని, దీంతో కండెక్టర్ శివప్ప అదుపుతప్పి.. బస్సులోనే కిందపడ్డాడు. దీంతో అతని పక్క టెముకలు విరిగాయి. నాటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన బుధ వారం డిశ్చార్జ్ అయ్యారు. డ్రైవర్ ఈశ్వర్‌నాయక్‌పై శివప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్ఐ రంగ గురువారం తెలిపారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కదిరి అర్బన్, అక్టోబరు 3 : సమాఖ్య పోరాటాలతోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కదిరి డిపోలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై సంఘటితంగా పోరాడుతామన్నారు. అలాగే ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలన్నారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఒకరూ కృషిచేయలన్నారు. జైబీమ్ అసోషియేషన్ సెకటరీ గంగాధర్ మాట్లాడుతూ డిపోలో ఎస్టీ ఎస్సీ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా రెండు యూనియన్లు కలిసికట్టుగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ విశ్వనాథ్, హరి, గంగరాజు, జీఎన్ స్వామి, రమణప్ప పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.95 వేలు విరాళం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 3: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల డీలర్ల సంఘం రూ.95 వేలు విరాళాన్ని అందించారు. గురువారం ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అందచేసినట్లు డీలర్ల సంఘం నాయకులు పిట్టా రాజారెడ్డి, బూదిలి ఓబులరెడ్డి, నారప్పరెడ్డి తెలిపారు.

ఎంపీడీఓగా విజయ భాస్కర్



ముదిగుబ్బ, అక్టోబరు 3: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా విజయ భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ కవిరాజు రొళ్ళ మండలానికి బదిలీ అయ్యారు. గార్లదిన్నెలో విధులు నిర్వహిస్తున్న విజయ భాస్కర్ ఇక్కడికి వచ్చారు.

ఆర్డీఓగా వెంకటసన్యాసి శర్మ



కదిరి, అక్టోబరు 3: కదిరి ఆర్డీఓగా వెంకటసన్యాసి శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ కావలికి బదిలీపై వెళ్లారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ట్రైబుల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటసన్యాసి శర్మ కదిరికి బదిలీపై వచ్చారు.

ఎక్సైజ్ సీఐగా నాగరాజు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 3 : జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సీఐగా నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూల్ జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి కన్నయ్య తిరుపతికి బదిలీపై వెళ్లారు.

బదిలీ అధికారులకు సన్మానం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 3: బదిలీ అయిన అధికారులను గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న పూలరెడ్డెప్ప, ఈఓఆర్‌డీ రాజశేఖర్ తనకల్లుకు బదిలీకాగా, సీనియర్ సహాయకులు గజ్జల శ్రీనివాసరెడ్డి పెనుకొండకు, జూనియర్ సహాయకులు వెంకటేష్ కదిరికి బదిలీ అయ్యారు. వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్ బాను, సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కనెక్షన్లను తొలగించండి

తాడిమర్రి, అక్టోబరు 3 : స్థానిక పడమటి చెరువులో కొందరు రైతులు అక్రమంగా బోర్లు వేయడంతో పాటు అక్రమంగా విద్యుత్ వాడుతున్నారని, ఆ అక్రమ కనెక్షన్లను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గురువారం ఈ మేరకు తాడిమర్రి సబ్ ఇంజనీర్ రవికి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. దీనిపై గతంలో కూడా ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఉన్నతాధికారుల వద్దకు వెళ్తామన్నారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని రవి అన్నారు.

కూటమి విజయాన్ని జీర్ణించుకోలేకే విమర్శలు

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై టీడీపీ నాయకుల ధ్వజం

ముదిగుబ్బ, అక్టోబరు 3: ఎన్నికల్లో కూటమి విజయాన్ని జీర్ణించుకోలేకే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నైతిక విలువలు లేని కేతిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పురందరేశ్వరికి నైతిక విలువలు లేవని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ధర్మవరంలో కేతిరెడ్డి వర్గీయులు కబ్జాలు, దౌర్జన్యాలు ప్రజలందరికి తెలుసన్నారు. ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా కేతిరెడ్డి మారలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపర్తి రమేష్, కృష్ణమూర్తి యాదవ్, కూడేరు రాము, చిన్నకోట్ల రాజా, గొడుగు అమీర్, చంద్రశేఖర్, భాస్కర్, చంద్ర, పతి పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు, అక్టోబరు 3: కూలీలు ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పీడీ విజయేంద్రప్రసాద్ సూచించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఉపాధి కూలీలతో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రతి కూలి వంద రోజులు పనులు పూర్తీ చేసుకో వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకం, కోళ్ల, గొర్రెలు, పశువులు , పట్టుపరుగుల షెడ్ల నిర్మాణం ఈ పథకం ద్వారా చేపట్టవచ్చన్నారు. మెట్టభూములలో పండ్లతోటల పెంపకాన్ని 25 రకాల పండ్ల మొక్కలు అందిస్తు న్నామన్నారు. గృహ నిర్మాణానికి సైతం 90 రోజుల పనిదినాలను కల్పిస్తున్నామన్నారు. ఉపాధి హామీపథకం కింద అనేక అభివృద్ధి కార్య క్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుధీర్, ఏపీడీ రఘునాథరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహులు, సర్పంచ్ రాదా, పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

దసరాను ప్రశాంతంగా జరుపుకోండి : ఎస్పీ



పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3 : జిల్లాలో దేవీ శరన్నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ వీ రత్న జిల్లా ప్రజలకు ఓ ప్రకటనలో గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ నవరాత్రులు ముగిసే వరకు డీజేలు, డ్యాన్సులు, బాణా సంచా ఊరేగింపులు పూర్తీగా నిషేధించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని పిలుపుచ్చారు. ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చర్యలు చేపట్టాలి

పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన, ఉద్యోగ విరమణ పొందిన పోలీసు కుటుంబాలకు రావాల్సిన బకాయిలను తొందరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక పోలీసుకార్యాలయంలో డీపీఓ సిబ్బందితో పోలీసు అసోషియేషన్ సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, మల్లికార్జున సీసీలు రాఘవేంద్ర, ఆనంద్, పోలీసు అధికారులు సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు సూర్యకుమార్ షౌకత్ అలీ డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

హరిత జిల్లాగా మారుద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3 : జిల్లాను హరిత వనంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. పుట్టపర్తి కప్పలబండ ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులో ఏర్పాటు చేసి ఏజీపీ ప్రథమ్ సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్, డీ-కంప్రెసర్ యూనిట్‌ను గురువారం ఆయన ఎస్పీ రత్న, రత్నాకర్, ఏజీపీ ప్రథమ్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి చిరదీప్‌దత్తతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లాలో ఏజీపీ ప్రథమ్ గ్యాస్ సంస్థ ఆధునిక సౌకర్యాలతో సీఎన్‌జీతో కూడిన డీసీయూ స్టేషన్‌ను ప్రారంభించడం స్వాగతిస్తున్నామన్నారు. ఏజీపీ ప్రథమ్ సంస్థ డిప్యూటీ రీజనల్ హెడ్ చిరాగ్ పటేల్ సునీల్‌జాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 3 : స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆ పోస్టర్లను తన నివాసంలో ఆయన విడుదల చేశారు. ఆర్గనైజనర్ నాగేష్ మాట్లాడుతూ.. బెంగుళూరు వైదేహి వైద్యశాలకు సంబంధించిన వైద్యులు ఈ ఉచిత వైద్యశిబిరంలో గుండె, కేన్సర్, కిడ్నీ, కీళ్లనొప్పులు, షుగర్, బీపీ, గ్యాస్టిక్ వ్యాధులకు చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యా యులను సన్మానిస్తామన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి : స్థానిక హిందూపురం క్రాస్‌లో రహదారులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. రహదారి గుంతలమయంగా మారిందని, వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ అధికారులు

పుట్టపర్తి రూరల్ : జిల్లాకు చెందిన పలువురు ఎక్సైజ్ అధికారులు ఎస్పీ వీ రత్నను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఏఈఎస్ నరసింహులు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి మునిస్వామి, సీఐ నాగరాజు, ఎస్ఐ ఉమామనోహర్‌రాజు ఉన్నారు.

అధునాతన పద్ధతుల్లో సాగు చేయాలి



ఎన్పీకుంటలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

నంబులపూలకుంట, అక్టోబరు 3 : సాంకేతిక పరిజ్ఞానం.. అధునాతన పద్ధతుల్లో సాగు చేస్తే మంచి దిగుబడిని సాధించవచ్చని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎన్పీ కుంట, జౌకల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలను పరిశీలించారు. వేరుశనగ సాగులో పాటించాల్సిన మెలకువలు, అధిక దిగుబడి ఎలా సాధించాలనే విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలానాయక్, సర్పంచ్ అంజనమ్మ, శ్రీరాములు, పట్టుపరిశ్రమ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ : వరిసాగుకు ఆకుముడత తెగుళ్ల సోకినట్లు మండల ఏఓ ముస్తాఫ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని చింతలపల్లి, వసంతపురం గ్రామాల్లో రైతులు వెంకటరత్నం, బాబయ్య వరి, కందిపంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ వరిపంట లో ఆకుముడుత తెగుళ్ల నివారణ కోసం క్లోరోఫైరిపాస్ రెండు ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వారి ఆధ్వర్యంలో ఘనజీవామృతం తయారుచేయు విధానంపై అవగాహన కల్పించారు.

ఓబుళదేవరచెరువు : వరికి సోకిన తెగుళ్ల నివారణపై గురువారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా, ఏఓ అబ్దుల్ అలీ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని డబురువారిపల్లి, ఆకుతోటపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, టమోట పంటలను పరిశీలించారు. వరికి నల్లి నివారణకు ఓమైట్ ఎకరాకు 300 మిల్లీలీటరు, టమాటకు ఆకుమచ్చ, కాయ మచ్చ తెగుళ్ల నివారణకు బ్లైటాక్స్ ఎకరాకు 500 గ్రాములు పిచికారి చేయాలన్నారు.

ఎంపీడీఓ సాయిమనోహర్ బాధ్యతల స్వీకరణ

ధర్మవరంరూరల్, అక్టోబరు 3 : నూతన ఎంపీడీఓగా సాయిమనోహర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ కొన్నినెలలుగా ఎంపీడీఓ లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు బత్తలపల్లి ఎంపీడీఓ సాయిమనోహర్‌ను ధర్మవరం ఎంపీడీఓగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేష్‌చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి విజయసారథి, మండల బీసీసెల్ అధ్యక్షుడు జంగం నరసింహులు, నాయకులు ఏగినాటి రమణ, గుత్తాసూరి, మోపూరిరామ్మోహన్‌చౌదరి, భాస్కర్‌చౌదరి, భాస్కర్‌రెడ్డి, తిరువీధుల పురుషోత్తం, మల్లేనిపల్లి చంద్ర, కత్తేకొట్టాల ప్రసాద్ ఎంపీడీఓను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఆర్డీఓకు పలువురి శుభాకాంక్షలు

ధర్మవరం, అక్టోబరు 3 : ధర్మవరం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌ను టీడీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ అన్ని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసు కుంటామన్నారు.ఆర్డీఓను కలిసిన వారిలో టీడీపీ నాయకులు చింతలపల్లి మహే శ్‌చౌదరి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, నాయకులు నాగూర్‌హుస్సేన్, భీమ నేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీఫ్, మాధవరెడ్డి, కేశగాళ్లశీన, విజయసారధి ఉన్నారు.



నూతన ఆర్డీఓను కలిసిన టీడీపీ నాయకులు

శరణు.. పరమేశ్వరీ..

● వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం

హిందూపురం అర్బన్, అక్టోబరు 3: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తొలిరోజు అమ్మవారి ఆలయాలతో పాటు అన్ని



హిందూపురం: జలదుర్గాదేవిగా జలదుర్గమ్మ

దేవాలయాల్లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాసవీమాతను పూలు నగలతో భువనేశ్వరీ మాతగా ముస్తాబు చేశారు. కొటిపి రోడ్డులోని గంగమ్మ ఆలయంలో ఎర్రాని చీరలో బాలత్రిపురాసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. నింకంపల్లి రోడ్డులోని యల్లమ్మ ఆలయంలో పసుపు కుంకుమ అలంకరణలో బాలత్రిపుర సుందరిగా కొలువుదీరారు. సాధుచెట్టి సంఘం ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లో పసుపు కుంకుమ అలంకరణలో జలదుర్గాదేవిగా జలదుర్గమ్మ ముస్తాబు చేశారు.

సోమందేపల్లి: మండలంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమందేపల్లిలో పలు ఆలయాల్లో దసరా పండుగ సందడి మొదలైంది. తొగటవీరక్షత్రియ ఆరాధ్య దైవమైన చౌడేశ్వరీఅమ్మవారిని ధర్మకర్త ఈశ్వరయ్య, కమిటీ అధ్యక్షుడు డీసీ హరి దంపతులు, జ్యోతి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారు అయోధ్య రాముడిగా దర్శనమిచ్చారు.

పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో గురువారం శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని గురువారం బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశక్తి పీఠాధిపతి దేవేంద్ర స్వామి, యోగినాథ్ మహరాజ్ ఆధ్వర్యంలో తొమ్మిదిరోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి దేవేంద్రస్వామి తెలిపారు. దసరా శరన్నవరాత్రిలో భాగంగా ప్రతిరోజూ వివిధ అలంకరణలో అమ్మవారిని అలంకరిస్తామని తెలిపారు.



బాలాత్రిపురసుందరిగా మోడల్ కాలనీ గంగమ్మ

పెనుకొండ: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీ వెంకటరమణస్వామిని మత్స్యావతారంలో అలంకరించారు. వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపురసుందరి రూపంలో అలంకరించారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు దంపతులు కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజల్లోపాల్గొన్నారు.

వాల్మీకి కల్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

పరిగి, అక్టోబరు 3: మండల కేంద్రంలోని ఇండియన్ గ్యార్మెంట్స్ వెనుకవైపున వాల్మీకి కల్యాణమండపం నిర్మాణానికి ఎంపీ పార్థసారథి గురువారం భూమిపూజ చేశారు. ముందుగా చెరువుకట్టవద్ద వాల్మీకి విగ్రహానికి ఆయన పూజలు చేశారు. అనంతరం జనసంద్రంతో ర్యాలీగా వెళ్లి మడకశిర-హిందూపురం ప్రధానరహదారి నుంచి శాసనకోటకువెళ్లే దారిలో కల్యాణమండపం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఊటకూరు మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఎంపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పరిగి మండల వాల్మీకులు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషిచేశారని కొనియాడారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ నిధులతో కళ్యాణమండపం నిర్మిస్తున్నామన్నారు. అనంతరం ఎంపీని ఘనంగా సత్కరించారు. టీడీపీ జిల్లా లీగల్‌సెల్ శివశంకర్, మాజీ ఎంపీటీసీ నరసింహప్ప, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సురేష్, వెంకటేశ్, చిన్నపల్లి వెంకటేశ్, ప్రసాద్, సోము పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎంపీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బీకేపార్థసారథి, జీఎం శేఖర్

పెనుకొండ రూరల్, అక్టోబరు 3: మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎంపీ బీకే పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని షీప్‌ఫారం సమీపంలో త్రిపుర రిసార్ట్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు సభ్యుడు డా.గోపీనాథ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్, పార్లర్‌మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. సమావేశంలో బీకే మాట్లాడుతూ డా.గోపీనాథ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి బ్యూటీషియన్ కోర్సులు ఉపయోగపడతాయన్నారు. త్రిపుర రిసార్ట్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతులకు ఉపయోగపడే కోర్సులు తమ సొంత ఖర్చులతో కోచింగ్ ఇచ్చారని కొనియాడారు. అనంతరం 11 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

రైతులకు ఉపాధి పథకం.. ఓ వరం



ఎంపీడీఓ యాదవేంద్రను సన్మానిస్తున్న జడ్పీటీసీ ఉమేష్

అగళి, అక్టోబరు 3: రైతులకు, కూలీలకు ఉపాధిహామీ పథకం వరం లాంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ ఉమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా గ్రామాలలో ఉపాధి పథకం కింద చేపట్టే పనులు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సక్రమంగా రైతులకు కూలీలకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు గుర్తించి పంపితే నిర్వహణ కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి గ్రామ పంచాయతీలో నమోదు చేయించాలని ఏపీఓ శిన్న, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 46 పనులను గ్రామాలలోని ప్రజలకు సక్రమంగా అమలు చేసి పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీఓ యాదవేంద్ర, ఏపీఓ శివన్న, టెక్నికల్ ఇంజనీర్ శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటప్ప, దేవగిరి మంజునాథ్, ఈరన్న, రమేష్, ఈరప్ప పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

పరిగి, అక్టోబరు 3: మండల వ్యాప్తంగా సచివాలయ పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన గురువారం గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేకంగా కొడిగెనహళ్లి గ్రామసభలో నీరు, డ్రైనేజీ, రహదారి దుస్థితిపై గ్రామస్థులు అధికారులకు వివరించారు. పరిగి పంచాయతీ వ్యాప్తంగా నీటి ఎద్దడి అధికంగా ఉన్నట్లు పలువురు మహిళలు పంచాయతీ కార్యదర్శులకు విన్నవించారు. గ్రామసభలో వెల్లువెత్తిన సమస్యలపై వినతులు సంబంధిత అధికారులు స్వీకరించి త్వరలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈఓఆర్డీ శ్రీధర్, సర్పంచ్ సాకమ్మ, లక్ష్మీశివశంకర్, బీజేపీ కన్వీనర్ చంద్ర, టీడీపీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రఘు, బీజేపీ, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని హొట్టేబెట్ట గ్రామంలో ఉపాధి హామీ పథకం 2025-2026 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. మండల కన్వీనర్ దాసిరెడ్డి, పాండురంగప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉపాధి పనులు చేసిన కూలీలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామన్నారు. ఏపీఓ ఓబుళప్ప, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఆనంద్, భరత్ పాల్గొన్నారు.

ఎంపీపీ చంద్రశేఖర్ మృతికి నివాళి



ఎంపీపీ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ రూరల్, అక్టోబరు 3: రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ అనారోగ్యంతో బుధవారం కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బీకే పార్థసారథి గురువారం రొద్దం చేరుకుని చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జీవీపీ నాయుడు, నరసింహులు, సుబ్బరత్నమ్మ, నరసింహులు, అశ్వత్థనారాయణ ఉన్నారు. ఎంపీపీ చంద్రశేఖర్ మృతి వైసీపీకి తీరనిలోటని మాజీ మంత్రు శంకర్‌నారాయణ, ఉషశ్రీ, భర్త చరణ్ పేర్కొన్నారు. గురువారం ఎంపీపీ మృతికి వారు నివాళులు అర్పించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

పావగడ, అక్టోబరు 3: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 1 నుంచి డిగ్రీ వరకు చదువుకొంటున్న ప్రీమెట్రిక్ అండ్ పోస్టు మెట్రిక్ విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ శాఖ అధికారి మల్లికార్జున సూచించారు. పోర్టల్ స్కాలర్‌షిప్‌కు కర్ణాటక ప్రభుత్వం 2024 సంవత్సరానికిగాను స్కాలర్‌షిప్పులు పొందడానికి అధికారులు తెలిపిన ఫారంలు భర్తీ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబరు నెలలోపు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. వివరాల కోసం సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

డీఎస్సీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ టౌన్, అక్టోబరు 3: వెనుకబడిన సంక్షేమశాఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెనుకొండ పట్టణంలోని వివేకానంద పాఠశాలలో 5వ తేదీ నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీకేను కలిసిన హిందూపురం తహసీల్దార్

పెనుకొండ, అక్టోబరు 3: ఎంపీ బీకే పార్థసారథిని గురువారం సాయంత్రం పెనుకొండలోని ఎంపీ కార్యాలయంలో హిందూపురం తహసీల్దార్ వెంకటేశ్ పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీకేకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేద కుటుంబాలకు హెల్ప్ సొసైటీ చేయూత



పేదకుటుంబానికి దసరా కిట్లు అందిస్తున్న మానం శశికిరణ్

పావగడ, అక్టోబరు 3: తాలూకాలోని వీరమ్మనహళ్లి గ్రామంలో నివసిస్తున్న ఓ పేద కుటుంబానికి స్థానిక హెల్ప్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు మానం శశికిరణ్ దసరా కిట్‌లు, స్కూల్‌బ్యాగులను అందించి మానవత్వం చాటుకొన్నారు. భర్తను పోగొట్టుకొన్న ఓ మహిళ ముగ్గురు ఆడపిల్లలను పోషిస్తోంది. ఎన్నో కష్టాలు పడుతున్న ఆ కుటుంబానికి ఇల్లులేక షెడ్డులో నివసిస్తున్నారు. పైకప్పు కోసం ఒక టార్పాలిన్ కూడా అందించి, ఆమెకు ఇల్లు కట్టి ఇవ్వడానికి అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. గ్రామస్థులు లోకేష్, బేకరీ నాగరాజు పాల్గొన్నారు.

మద్యం షాపులకు 3వ రోజు దరఖాస్తులు నిల్

పెనుకొండ టౌన్, అక్టోబరు 3: నూతన మద్యం విధానంలో భాగంగా మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియతోపాటు దరఖాస్తుల స్వీకరణ మూడు రోజులు కావస్తున్నా ఇంతవరకు ఒక్కరు కూడా దరఖాస్తు చేయలేదని ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంవద్ద దరఖాస్తుల స్వీకరణ నిబంధనలను ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ పెనుకొండ పరిధిలో 13 మద్యం షాపులున్నాయని ఇందులో సోమందేపల్లి 3, పెనుకొండ 5, గోరంట్ల 4, రొద్దం ఒక షాపు ఉందన్నారు. దరఖాస్తుల స్వీకరణ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.



దరఖాస్తు స్వీకరణ నిబంధనలు ప్రదర్శిస్తున్న దృశ్యం

దరఖాస్తులు చేసుకోండి

హిందూపురం: ప్రైవేట్ మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఓ ప్రకటనలో కోరారు. టెండర్ దాఖలు చేయడానికి మూడు బాక్సులు ఏర్పాటు చేశాన్నారు. దరఖాస్తు ఫారాలు స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. 9వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 10న దరఖాస్తుల పరిశీలన, 11న ఉదయం 8గంటలకు పుట్టపర్తిలో కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు లక్కీ డ్రిప్ ద్వారా కేటాయిస్తారన్నారు. హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6, రూరల్‌లో 1, లేపాక్షి 1, చిలమత్తూరు 1, పరిగి 2, మొత్తం 11మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి: సీపీఎం



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 3: విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకుడు పెద్దన్న మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. ఎంతో మంది ప్రాణత్యాగాల ప్రతిఫలం పరిశ్రమ అన్నారు. పరిశ్రమను కేంద్రం ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నించడం సమంజసంకాదన్నారు. లక్షల మంది పరిశ్రమద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. నాయకులు బెస్త కిష్టప్ప, రామక్రిష్ణ పాల్గొన్నారు.

పెనుకొండ: ఎన్నోపోరాటాల ఫలితంగా ఆంధ్రులు సాధించుకున్న విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణ మానుకోవాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం నాయకుడు హరి, గంగాధర్, బాబావలి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమద్వారా లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారన్నారు. పరిశ్రమ ప్రైవేటీకరిస్తే లక్షలాది మంది ఉపాధిలేకుండా రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు.



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మడకశిరలో భారీ వర్షం



మడకశిరలో కురుస్తున్న వర్షం

మడకశిర టౌన్, అక్టోబరు 3: మడకశిరలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో రైతులు వేరుశనగను తొలగించుకొనేందుకు సిద్ధమయ్యారు. బుధవారం రాత్రి మడకశిర మండలంలో 34 మిల్లీ మీటర్లు, రొళ్లలో 12.2, అగళిలో 23.4, గుడిబండలో 6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



గుట్టూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా గురువారం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మధ్యాహ్నం 2-30నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి గుట్టూరు ప్రధాన రహదారి జలమయమైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి భారీ వర్షాలకు గ్రామాల్లోకి నీరురాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరేగింపులకు డీజే అనుమతి లేదు

హిందూపురం, అక్టోబరు 3: శరన్నవరాత్రులు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల ఊరేగింపునకు డీజేలు, డ్యాన్సులు, బాణసంచా పేలుళ్లకు అనుమతి లేదని డీఎస్పీ మహేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఈసారి దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. ఏర్పాటు చేసుకున్నవారు ప్రశాంతంగా కార్యక్రమం ముగించాలితప్ప ఊరేగింపునకు అనుమతి లేదన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా విగ్రహాలు ఊరేగింపుతో తీసుకెళ్లాలని భావిస్తున్నారన్నారు. అలాంటివారు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఎంపీడీఓగా నరేంద్రకుమార్



గోరంట్ల, అక్టోబరు 3: ఎంపీడీఓగా నరేంద్రకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, నల్లచెరువుకు బదిలీఅయ్యారు. హిం దూపురం ఎంపీడీఓగా పనిచేస్తున్న నరేంద్రకుమర్ గోరంట్ల ఎంపీడీగా నియమితులయ్యారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఎంపీపీ ప్రమీల, పంచాయతీ కార్యదర్శులకు ఆయనకుస్వాగతం పలికారు.

తహసీల్దార్‌గా కరుణాకర్



మడకశిర టౌన్, అక్టోబరు 3: మడకశిర తహసీల్దార్‌గా కరుణాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేష్, హిందూపురం తహసీల్దార్‌గా బదలీ అయ్యారు. గుడిబండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కరుణాకర్‌ను మడకశిర తహసీల్దార్‌గా నియమించారు. రెవెన్యూకు సంబంధించి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు.

గోరంట్లను కరువు మండలంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, అక్టోబరు 3: గోరంట్లను కరువు మండలంగా ప్రకటించాలని టీడీపీ నాయకులు పలువురు రైతులతో కలిసి తహసీల్దార్ మారుతికి గురువారం వినతి పత్రం అందచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద మండలమైన గోరంట్లలో అధిక సంఖ్యలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలున్నాయన్నారు. పంటలు పండక, గిట్టుబాటు ధర లేక రైతులు, కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారన్నారు. సాగుచేసిన పంటలు వర్షాభావం వలన ఎండిపోవడంతోపాటు తాగునీటి సమస్య ఏర్పడిందని అన్నారు. కరువు మండలంగా ప్రకటిస్తూ సాగు, తాగునీరు అందించాలని కోరారు. టీడీపీ కన్వీనర్ సోముశేఖర్, బాలక్రిష్ణ, నిమ్మల శ్రీధర్, నరేష్, సుధాకర్‌రెడ్డి, అజము, సుబ్బు, వేణు, కిషోర్ పాల్గొన్నారు. అనంతరం పుట్టపర్తికి వెళ్లి జేసీ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

భవన నిర్మాణ కార్మికుడికి పరామర్శ

సోమందేపల్లి, అక్టోబరు 3: ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న భవన నిర్మాణ కార్మికుడు నాగభూషణాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పరామర్శించారు. ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యంపై, ప్రమాద సంఘటన గురించి బాధితుడు విచారించారు. వైద్యం కోసం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అధికారుల సూచనలు తప్పక పాటించాలి

గుడిబండ, అక్టోబరు 3: వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను రైతులు తప్పక పాటించాలని వ్యవసాయాధికారి వీరనరేష్ అన్నారు. గురువారం మండలంలోని జమ్ములబండ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది, రాగి పంటలతో అధిక దిగుబడులు సాధించేందుకు అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించాలన్నారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచులు కవిత, ఓబన్న, రైతు రామాంజనేయులు పాల్గొన్నారు.



రాగిపంటను పరిశీలిస్తున్న ఏఓ వీరనరేష్

ఐసీడీఎస్

● సీడీపీఓ వర్సెస్ సూపర్‌వైజర్లు
● మూకుమ్మడిగా సెలవుపెట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు
● వెనకుండి నడిపిస్తున్న మరో అధికారి

హిందూపురం, అక్టోబరు 3: మహిళా శిశు సంక్షేమశాఖలో సీడీపీఓ, సూపర్‌వైజర్ల మధ్య కోల్డ్‌వార్‌కొనసాగుతోంది. ప్రస్తుతం ఇది చిలికి చిలికి గాలివానలా మారి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు దాకా వెళ్లింది. అంతేకాక ఒకరిపై ఒకరు చేసిన తప్పులను రాజకీయ పార్టీ నాయకులవద్ద చెప్పుకుని గోడువెళ్లబోసుకుంటున్నారు. ఇందుకు చాపకింద నీరులా మరో అధికారి సూపర్‌వైజర్లకు వెనుకుండి నడిపిస్తున్నట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో మూకుమ్మడిగా ఒకేరోజు సెలవుపెట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లినట్లు తెలిసింది. అయితే ఇటీవల ఓ నాయకురాలు వాట్సప్‌గ్రూప్ క్రియేట్ చేయడంపై కూడా సూపర్‌వైజర్లతోపాటు మరికొంతమంది కార్యకర్తలు మండిపడుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా హిందూపురం ఐసీడీఎస్ పరిధిలో సైలెంట్‌గా జరుగుతున్న వార్ రేపో మాపో రోడ్డున పడనుంది. దీంతో ఈ వర్గపోరు ఎక్కడికి దారితీస్తుందోనని కిందిస్థాయి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూకుమ్మడి సెలవు

రెండేళ్ల క్రితం సీడీపీఓ హిందూపురం ఐసీడీఎస్‌కు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి కొంతమంది సూపర్‌వైజర్లు, అంగనవాడీ కార్యకర్తలు సీడీపీఓపై గుర్రుగా ఉన్నారు. దీనికితోడు వారి యూనియన్‌కు సంబంధించి సీడీపీఓకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇంతకాలం వారి మధ్యే ఉన్న సమస్య ఇటీవల బహిర్గతం అవుతోంది. కొంతమంది సూపర్‌వైజర్ పట్ల సీడీపీఓ కఠినంగా వ్యవహరిస్తున్నారని కొన్ని సందర్భాల్లో సూపర్‌వైజర్లపై ఒత్తిడి తెస్తున్నారని వారు చెప్పుకుంటున్నారు. మార్చడానికి ప్రయత్నించడంవల్లేనా హిందూపురం ఐసీడీఎస్ పరిధిలో కొంతమంది సూపర్‌వైజర్లు నాలుగు నుంచి ఐదేళ్లపాటు ఒకే క్లస్టర్‌లో పని చేస్తున్నారు. ఇటీవల కొంతమంది సూపర్‌వైజర్లు క్లస్టర్లవారీగా మార్చడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. దీంతో కొంతమందికి ఇది మింగుడు పడలేదు. అనవసరంగా మమ్మల్ని మారుస్తున్నారంటూ సూపర్‌వైజర్లు గగ్గోలు పెడుతున్నారు. సూపర్‌వైజర్లతో క్లస్టర్ల వారిగా మార్చే అధికారం సీడీపీఓకు ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పని ఒత్తిడి నేపథ్యంలో మార్చే వెసులుబాటు సదరు అధికారికి ఉంటుంది. ఇటీవల మార్చడానికి ప్రయత్నించడంపై సూపర్‌వైజర్లు ఒకింత అసహనానికి గురయ్యారు. ఇప్పటి వరకు మమ్మల్ని ఎవరూ మార్చాలని చూడలేదు. అంతేకాక సదరు సీడీపీఓ వచ్చి రెండేళ్లవుతున్నా ఇప్పటి దాకా నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడే ఎందుకు తీసుకుందని సదరు అధికారి చెప్పినా కొన్నింటిని నెరవేర్చకపోవడంవల్లే ఇలా మాపై ఒత్తిడి తెస్తున్నట్లు సూపర్‌వైజర్లు వాపోతున్నారు.

వెనుకుండి నడిపిస్తున్న మరో అధికారి?

ఇవన్నీ ఇలా ఉంటే మరికొంతమంది సూపర్‌వైజర్లు కొంతమంది అంగనవాడీ కార్యకర్తలకు గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి వెనుకుండి నడిపిస్తున్నట్లు ఐసీడీఎస్‌లో చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న అధికారికి గతంలో పనిచేసిన అధికారికి కొంతకాలంగా సైలెంట్‌వార్ సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా ప్రస్తుతం ఉన్న అధికారిపై ఒత్తిడి తేవాలన్న ఉద్దేశ్యంతో సూపర్‌వైజర్లను ముందుపెట్టి ఆ అధికారి నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భరించలేకపోతున్నాం..

ఇటీవల కొంతమంది సూపర్‌వైజర్లు అంగనవాడీ కార్యకర్తలు, సీడీపీఓలపై నాయకులవద్ద పంచాయతీ పెట్టారు. ఈ సందర్భంగా సదరు అధికారి మమ్మల్ని తీవ్రంగా వేధిస్తోందని సదరు అధికారి ఒత్తిడి చేసిన సంఘటనలు నాయకులవద్ద చెప్పుకున్నట్లు సమాచారం. ఐసీడీఎస్‌లో జరుగుతున్న తతంగంపై నాయకులవద్ద మొరపెట్టుకున్నారు. ఇదే సందర్భంలో



సదరు అధికారి మాట్లాడుతూ నేనెవరిపై ఒత్తిళ్లు చేయలేదని అయితేసమయపాలన పాటించకపోవడం, పై అధికారులు చెప్పిన పనిని సరిగా చేయకపోవడంవల్లే మందలించానే తప్ప ఎవరినీ ఇబ్బందిపెట్టలేదని చెప్పినట్లు తెలిసింది.

వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడంపై మండిపాటు

ఇటీవల ఐసీడీఎస్‌లో కొంతమంది సూపర్‌వైజర్లు, మరికొంతమంది కార్యకర్తలతో కలిపి ఓ పార్టీనాయకురాలు వాట్సప్ గ్రూపును క్రియేట్ చేశారు. ఇందులో కొంతమంది తప్పిదాలు పోస్ట్ చేయడంతో ఇది మింగుడు పడని కొంతమంది గ్రూప్ క్రియేట్ చేయడంపై మండిపడుతున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేసినట్లు సమాచారం. శనివారం మూకుమ్మడిగా సెలవుపెట్టి ఉన్నతాధికారులకు సదరు అధికారిపై ఫిర్యాదు చేయడానికి వెళ్లినట్లు తెలిసింది. అయితే వారు సెలవు పెట్టినట్లు లేఖ పంపగా వారికి సెలవును మంజూరు చేయలేదని సదరు అధికారి తెలిపారు. ఏది ఏమైనా హిందూపురం ఐసీడీఎస్ పరిధిలో ఇటీవల కార్యకర్తలు, సూపర్‌వైజర్‌పై ఫోన్‌లో మాట్లాడుకున్న సంభాషణలు సోషల్ మీడియాకు ఎక్కాయి. ఇది ఎక్కడికి దారితీస్తుందోనని కొంతమంది అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.